కమీషన్ల కోసం కక్కుర్తిపడి..



శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయని తాము చెప్పడం కాదు.. ఎన్డీటీ ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ అయింది. అదనపు ఈవోగా ధర్మారెడ్డి వచ్చాకే నెయ్యి గోల్‌మాల్ జరిగింది. కమీషన్ కోసం కక్కుర్తిపడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారు.

- నారా లోకేశ్, రాష్ట్ర మంత్రి

నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారు



వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారు. లడ్డూ వాసన వస్తోందని నాడు భక్తులు ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విచారణ జరిపించడంతో లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారని నిగ్గు తేలింది.

- ఆనం వెంకటరమణారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అది విదేశీ బట్టర్ ఆయిల్



స్వచ్ఛమైన ఆవునెయ్యి వాడితేనే శ్రీవారి లడ్డూకు నాణ్యత వస్తుంది. వైసీపీ హయాంలో.. పాలకమండలి పెద్దల కమీషన్ల కోసం కర్ణాటక సంస్థను కాదని ఢిల్లీకి చెందిన 'అల్ఫా'ను తీసుకొచ్చారు. విదేశాలనుంచి బట్టర్ ఆయిల్‌ను ప్రాసెస్‌చేసి, కలర్ కలిపి ఆవునెయ్యిగా మార్చి వాళ్లు సరఫరా చేశారు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

ల్యాబ్ టెస్ట్‌లు చేయించకనే..



రోజుకు 14టన్నుల ఆవు నెయ్యిని టీటీడీ వినియోగిస్తోంది. ఈ నెయ్యికి ఎలాంటి ల్యాబ్ టెస్ట్‌లు చేయడంలేదు.నాణ్యతలేని నెయ్యితో శ్రీవారి లడ్డూ తయారు చేయడంతో రుచి లేకుండా పోయింది. వైసీపీ హయాంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీని భ్రష్టు పట్టించారు.

- భానుప్రకాశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

లడ్డూ పవిత్రతను దెబ్బతీశారు



నాణ్యతలేని, కల్తీ నెయ్యిని సరఫరా చేసి పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాద పవిత్రతను దెబ్బతీశారు. నెయ్యి గోడౌన్‌లో పని చేసే వారే కల్తీ నెయ్యి విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని త్వరలోనే దోషులుగా నిలబెట్టబోతున్నాం.

- నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

నా బిడ్డను ఆదుకోండి



దత్తాత్రేయ (ఫైల్ ఫొటో)


- గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగికి యాక్సిడెంట్
- 8 నెలలుగా కోమాలోనే దత్తాత్రేయ
- జీతభత్యాలను నిలిపేసిన వైసీపీ సర్కార్
- తలకిందులైన బంగారు భవిష్యత్
- కుమిలిపోతున్న తల్లిదండ్రులు

చేతికొచ్చిన కొడుకు. సర్కారు కొలువు. జీవితం సెటిల్ అయిపోయిందనుకునేలోపే అంతా తారుమారైంది. అప్పటివరకు ఆనందంగా సాగిన ఆ కుటుంబ తలరాత ఒక్క యాక్సిడెంట్‌తో తలకిందులైపోయింది. మంచంమీదున్న బిడ్డను చూసుకుంటూ, అతను కన్న భవిష్యత్తును తలుచుకుంటూ ఆ తల్లిదండ్రులు కుమిలికుమిలి విలపిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చంద్రగిరి నియోజకవర్గం మల్లంగుంట రోడ్డు ఉత్తరపు కండ్రిగలోని లక్ష్మి, ఎల్లయ్య దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు దత్తాత్రేయ. ఇతడి తండ్రి తిరుపతి మున్సిపల్ కూరగాయల మార్కెట్లో చిన్న కిరాణ షాపు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని కామచిన్నయపల్లి సచివాలయంలో దత్తాత్రేయ వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణకోసం జెండాలు, ఫ్లెక్సీలు తీసుకుని గతేడాది డిసెంబరు 23వ తేది ఉదయం 7.30 ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై ఈయన బయలుదేరారు. చంద్రగిరి ఫ్లైఓవర్ (చెర్లోపల్లె) వద్ద యాక్సిడెంట్‌కు గురయ్యారు. ఏటీఎంలో నగదు నింపే వాహనం నిర్లక్ష్యంగా మలుపు తిప్పడంతో దత్తాత్రేయ వెళుతున్న ద్విచక్రవాహనానికి తగిలింది. హెల్మెట్ వేసుకున్నప్పటికీ ఆయన తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రుయాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లమని అక్కడి వైద్యులు సూచించారు. అంబులెన్స్‌లో చెన్నైకు తీసుకెళుతుండగా దారిలోనే పరిస్థితి విషమించింది. దీంతో వేలూరు సీఎంసీకి వెళ్లారు. తలకు సంక్లిష్టమైన పెద్ద ఆపరేషన్ చేశారు. 15రోజులు అక్కడే ఉంచుకుని, పోస్ట్ ఆపరేటివ్ చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లమన్నారు. మూడునెలలు ఆస్పత్రిలోనే వైద్యం చేసుకున్నారు. దెబ్బ బలంగా తగలడంతో కోమాలోకి వెళ్లారు. ఉన్నదంతా అమ్మి, అప్పులు చేసి రూ.50 లక్షల ఖర్చు పెట్టారు. అయినా అచేతన స్థితిలోనే దత్తాత్రేయ ఉన్నారు. ఇప్పుడు చేతిలో డబ్బులు లేవు. నెలనెలా ఆస్పత్రికి వెళ్లేందుకు, మందులు కొనసాగించేందుకు కూడా వీరికి కష్టంగా మారింది.

- దత్తాత్రేయ చదువులో ముందుండేవారు. ఢిల్లీకి వెళ్లి సివిల్స్‌కు శిక్షణ తీసుకోవాలని భావించారు. ఇంతలో సచివాలయ ఉద్యోగానికి ఎంపికకావడంతో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమయ్యేవారు. అతనొకటి తలిస్తే విధి మరొకటి తలిచింది. యాక్సిడెంట్‌కు గురికావడంతో మంచానికే పరిమితమవ్వాల్సి వచ్చింది.
- గతంలో సీఎం హోదాలో జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వాళ్లకు సచివాలయ ఉద్యోగి అయిన దత్తాత్రేయ మార్గదర్శకుడిగా ఉన్నారు. అలాంటిది ఇప్పుడు ఆయనే విధివంచితుడై సహాయం కోసం అచేతనంగా ఎదురు చూస్తున్నారు.



బిడ్డ ఆలనా పాలన చూస్తూ కుమిలిపోతున్న తల్లి

- విధి నిర్వహణలో ప్రమాదం జరిగినప్పటికీ డిసెంబరు నుంచి జీతభత్యాలు ఆపేశారు. ఆర్థిక సహకారం అందలేదు. కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. సహచర ఉద్యోగులు మానవతాదృక్పథంతో తలాచేయి వేశారు కానీ అప్పటి జగన్‌రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని దత్తాత్రేయ తల్లి దండ్రులు వేడుకుంటున్నారు.

అడుగడుగునా నీరాజనం


- మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికిన శ్రేణులు





విమానాశ్రయం వద్ద మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టరు వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌కు కూటమి శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో శుక్రవారం పర్యటన నిమిత్తం ఆయన గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒకదశలో వీరిని పోలీసులు నియంత్రించలేకపోయారు. దాదాపు గంట పాటు పార్టీశ్రేణులను లోకేశ్ ఆప్యాయంగా పలకరించి ఫొటోలు దిగారు. రాత్రి 8.30 గంటలకు విమానాశ్రయం నుంచి కాన్వాయ్‌గా బంగారుపాళ్యానికి బయలుదేరారు. దామినేడు సర్కిల్ వద్ద పైనాపిల్ పండ్లతో టీడీపీ నేత డాలర్ దివాకర్ రెడ్డి స్వాగతం పలికారు. తాజ్ హోటల్, చంద్రగిరి సర్కిల్ వద్ద పెద్దఎత్తున పార్టీ శ్రేణులు లోకేశ్ కాన్వాయ్‌ను ఆపి 'జై లోకేశ్' నినాదాలతో హోరెత్తించారు. లోకేష్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), పులివర్తి నాని (చంద్రగిరి), ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ నేత ఇందుశేఖర్, శ్రీధర్ వర్మ, రవినాయుడు తదితరులున్నారు.



వరద బాధితుల కోసం..

- సీఎంకు రూ.పది లక్షలు అందించిన ఎస్సీవీ నాయుడు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు రూ.10లక్షలు విరాళం అందజేశారు. తన కుమారుడు ఎస్సీవీ శ్రీకాంత్‌తో కలిసి గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబుకు చెక్కు అందించారు. స్థానిక నాయకులు గోగినని భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి



రూ.10.08 లక్షలు ఇచ్చిన సైకం

వరద బాధితుల కోసం తిరుపతికి చెందిన సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టేట్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి రూ. 10.08 లక్షలను విరాళంగా అందించారు. గురువారం తిరుపతికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కు అందజేశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి రూరల్

పేదల ఆకలి తీర్చేలా..



- 7 అన్న క్యాంటీన్ల ప్రారంభం

తిరుపతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు జిల్లాలో ఏడు అన్న క్యాంటీన్లను గురువారం ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న వీటిని.. వైసీపీ అధికారంలోకి రాగానే మూసేసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించింది. జిల్లాలో రెండో విడతగా తిరుపతి నగరం స్విమ్స్ సర్కిల్, ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన, ఎమ్మార్‌పల్లె సర్కిల్ సమీపాన రెండింటితో పాటు నాలుగు.. గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఏడు అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి.

బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- అధికారుల సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో జిల్లా.. టీటీడీ అధికారులు, ఇతర శాఖలతో సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, జిల్లా యంత్రాంగం నుంచి ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- గత రెండేళ్లుగా వాహనాల రాకపోకలు పెరగడంతో తిరుమలలో పార్కింగ్ స్థలాల కొరత తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి తగిన సంఖ్యలో బస్సులు నడపాలి.
- అలిపిరి లింక్ బస్టాండ్, మున్సిపల్ గ్రౌండ్స్, వినాయకసాగర్ క్వార్టర్స్‌లో ద్విచక్రవాహనాలు.. భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో ప్రైవేట్ జీపులు, కార్లు సహా అన్ని నాలుగు చక్రాల వాహనాలు.. ఎస్వీ జూపార్క్ పక్కనే ఉన్న దేవలోక్‌లో ప్రైవేట్ బస్సుల కోసం పార్కింగ్ ఏర్పాటు.
- చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగింగ్ ఏర్పాటు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు లగేజీ సెంటర్‌ను సేవాసదన్1, 2 ఎదురుగా మార్పు.
- నాలుగుమాడవీధుల్లో భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం. యాత్రికుల కోసం మరిన్ని 'మే ఐ హెల్ప్ యూ' సమాచార కేంద్రాల ఏర్పాటు.
- వైద్య శిబిరాలకోసం స్విమ్స్, రుయా, బర్డ్ నుంచి అదనపు వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవడం.
- తిరుమలలో మెరుగైన పారిశుధ్య పనులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో నగరంలోనూ పారిశుధ్య పనుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలి.

46 మంది కానిస్టేబుళ్ల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు19: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 46 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో కొందరిని పరిపాలనా సౌలభ్యం కోసం మార్చినా.. మరికొందరిపై అవినీతి ఆరోపణలు, పనితీరు సరిగా లేకపోవడం, ఫిర్యాదులు రావడంతో స్థానచలనం కల్పించారు. త్వరలో మరోసారి భారీ ఎత్తున కానిస్టేబుళ్లను బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

యాచకుల్లా నటన.. భక్తుల్లా ముసుగు

- ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు
- రూ.7 లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19: చంటిబిడ్డలను చంకన పెట్టుకుంటారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేసేలా నటిస్తారు. అదును చూసి.. ఏమార్చి చోరీలకు పాల్పడుతుంటారు. తిరుమలలోనూ భక్తుల ముసుగులోనూ చేతివాటం చూపి.. డబ్బు, నగలు, మొబైల్ ఫోన్లు తస్కరిస్తుంటారు. అలాంటి ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను తిరుపతి క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ వివరాలను జిల్లా క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తూత్తికోరిన్ జిల్లా మంతితోపు గ్రామానికి చెందిన భగవత్ శారద, ఆర్. ప్రియ స్నేహితులు. ఏడేళ్లుగా వీరు తిరుమల, తిరుచానూరు బ్రహ్మోత్సవాలు, వెంకటగిరి జాతర.. కొండపై రద్దీ రోజుల్లో వీరు ఇక్కడకు వస్తారు. తిరుపతిలోని శ్రీనివాసం, ఉచిత సత్రాలు వద్ద తలదాచుకుంటారు. అదును చూసి చోరీలకు పాల్పడుతుంటారు. తరచూ తిరుమలకు వెళ్లి.. అక్కడ ఉచిత బస్సులు ఎక్కే సమయంలో బాగా రద్దీగా ఉంటే భక్తుల బ్యాగుల్లోని విలువైన నగలు, నగదు, సెల్‌ఫోన్లు కొట్టేస్తుంటారు. ఈ క్రమంలో తిరుమలలో రెండు.. తిరుపతి పోస్టల్ కాలనీలో ఒక దొంగతనంపై క్రైం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై అదనపు ఎస్పీ నాగభూషణరావు నేతృత్వంలో క్రైం డీఎస్పీ రమణకుమార్, సీఐ అబ్బన్న, హెడ్ కానిస్టేబుళ్లు మురళి, గోపికృష్ణ, రమేష్, కానిస్టేబుళ్లు మోహన్, ప్రసాద్‌తో ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. నిందితులు పాత నేరస్తులని.. గతంలో పలుసార్లు అరెస్టయ్యారని గుర్తించారు. ఈ క్రమంలో ఫొటోల ఆధారంగా గురువారం తెల్లవారు జామున విష్ణునివాసం వద్ద చంకలో బిడ్డలను పెట్టుకుని తిరుగుతున్న ఇద్దరు మహిళలను అనుమానించి.. విచారించారు. దీంతో వీరి దొంగతనాలు బయటపడ్డాయి. వీరి నుంచి రూ.7 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు, రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ అబ్బన్న, సిబ్బందికి రివార్డుల కోసం ఎస్పీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అదనపు ఎస్పీ చెప్పారు. తిరుమల, తిరుపతిలో పోగొట్టుకున్న సుండుపల్లికి చెందిన లక్ష్మీదేవి 33 గ్రాములు, పోస్టల్ కాలనీకి చెందిన ఆదిలక్ష్మి 40 గ్రాముల బంగారు నగలు, అలూరుకు చెందిన శ్రీనివాసులుకు రూ.6500, కర్ణాటకకు చెందిన దాస్, గుంటూరుకు చెందిన నరేంద్రకు సెల్‌ఫోన్లను పోలీసులు అప్పగించారు.

ఉచిత ఇసుక పాలసీ పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీకి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆవిష్కరించారు. ఇసుక నిర్వహణ పోర్టల్‌ను అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఏఎస్పీ రవి మనోహరాచారి తదితర అధికారులు పాల్గొన్నారు. పోర్టల్ ప్రారంభ వర్చువల్ కార్యక్రమం పూర్తయిన తరువాత ఎమ్మెల్యే, ఏఎస్పీ, గనులశాఖ అధికారులు, ఇతర అధికారులతో కలిసి ఇసుక నిర్వహణ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఎస్వీయూకు ఐఎస్‌వో గుర్తింపు


ఐఎస్ఓ సర్టిఫికెట్‌తో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: ఎస్వీయూకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఏడు దశాబ్దాల సుదీర్ఘ చరిత్రలో అత్యున్నత ప్రమాణాలతో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేసిన కృషికి ఈ గుర్తింపు ప్రకటించారు. యూనివర్సిటీలో రెండు రోజులుగా హైదరాబాదుకు చెందిన హెచ్‌వోఎం ఇంటర్నేషనల్ సంస్థ అధ్యయనం చేసి ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని ఐఎస్‌వో ప్రతినిధి శివయ్య అందజేశారు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితో యూనివర్సిటీ ఈ గుర్తింపు లభించిందన్నారు. తాళపత్రాల సంరక్షణకు ఓఆర్ఐ తీసుకున్న చర్యలకు ఐఎస్‌వో ప్రతినిధి బృందం ప్రత్యేక సర్టిఫికేషన్ ఇచ్చింది. ఇందుకు ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వీసీ వెంకటేశ్వర్లును అధికారులు అభినందించారు. యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభం


తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19: స్విమ్స్‌లో తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలు ప్రారంభమయ్యాయి. స్విమ్స్‌లో కాన్పు చేయించుకున్న తల్లులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం రెండు తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందించింది. వీటిని గురువారం డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ప్రారంభించారు. హైరిస్కు గర్భవతుల రవాణా కోసం స్విమ్స్ ఇప్పుడు రెఫరల్ హాస్పిటల్ కిందకు రావడం జరిగిందని ఇందులో భాగంగా మాతా శిశు మరణాలను నివారించేందుకు హాస్పిటల్లో ప్రభుత్వం రెండు వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ వాహన సేవలు అవసరమైన వారు 102 నంబరుకు కాల్ చేస్తే 30 నిమిషాల వ్యవధిలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల మాదిరిగానే స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రిలోనూ కాన్పులు ఉచితంగా చేస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా సిజేరియన్, హైరిస్కు గర్భవతులకు ఉచిత కాన్పులు కూడా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, ఆర్‌ఎంవో కోటిరెడ్డి, వైద్యాధికారులు మృదుల, ప్రవళిక, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ జిల్లా సమన్వయకర్త సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం తనిఖీలు చేపట్టారు. కంపార్టుమెంట్ల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందించే నిర్దేశిత సమయాలను పరిశీలించారు. కంపార్టుమెంట్లలో భక్తులను విడుదల చేసే సమయాన్ని పరిశీలించారు. ఎక్కడ నుంచి వచ్చారు, ఎన్ని గంటలకు క్యూలోకి వచ్చారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు. లడ్డూకౌంటర్లలోనూ తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీఈవో లోకనాథం, వీఎస్వో సురేంద్ర, ఏఈవోలు శ్రీహరి, మునిరత్నం, ఏవీఎస్వో మనోహర్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 19: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవోలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. గురువారం నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్-14, అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. వాలీబాల్ అండర్-17లో కేకేవీపురం, కుప్పం బాదూరు, కమ్మకండ్రిగ, నెత్తకుప్పం ఉన్నత పాఠశాలలకు చెందిన భానుప్రకాష్, హేమచంద్ర, యశ్వంత్‌కుమార్, మహేష్, సల్మాన్, గౌతమ్, అండర్ -14 విభాగంలో కమ్మకండ్రిగ, కుప్పంబాదూరు, నెత్తకుప్పం ఉన్నత పాఠశాలలకు చెందిన జితేంద్ర, ఢిల్లీ, బద్రి విశాల్, దొరకృష్ణ, బాలాజీ ప్రతిభ కనబరచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. హెచ్‌ఎం తులసికుమారి, పీడీలు రామకృష్ణ, గోపీనాథ్, భార్గవి, సురేష్, దేవ, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ


మొక్కలు నాటుతున్న తహసీల్దారు జనార్దన్ రాజు

భాకరాపేట, సెప్టెంబరు 19: మొక్కల పెంపకంతో వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చునని తహసీల్దారు జనార్దన్‌రాజు అన్నారు. మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' మాస్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా చిన్నగొట్టిగల్లు సమీపంలో మొక్కలు నాటారు. మెగా ఇంజనీరింగ్ అధికారులు నాగేంద్రబాబు, రవీంద్రనాథ్ ఠాగూర్, విజయ కుమార్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం


ఉభయదేవేరులతో తిరుచ్చిపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, సెప్టెంబరు 19: తిరుచానూరులోని సుందరరాజస్వామికి గురువారం రాత్రి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్ కుమార్, సూపరింటెండెంట్ శేషగిరి, మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.


సాంకేతికత ద్వారా కొత్త పరిశోధనలు చేయండి

- వెటర్నరీ వర్సిటీ కళాశాల వార్షికోత్సవంలో వీసీ పిలుపు

తిరుపతిరూరల్, సెప్టెంబరు19: అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని పశువైద్యరంగంలో కొత్త పరిశోధనలు చేయాలని విద్యార్థులకు ఎస్వీవెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణ పిలుపునిచ్చారు. ఎస్వీవెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కళాశాల 61వ వార్షికోత్సవంలో (అనంత్య-2కే24) ఆయ మాట్లాడారు. కళాశాల ప్రాంగణంలో మరిన్ని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలో జరుగుతున్న అభివృద్ధిపై అభినందించారు. కళాశాలతో తనకు ఉన్న అనుబంధాన్ని ప్రత్యేక అతిథిగా హాజరైన వేలూరు ఫారెస్ట్ డివిజన్ జిల్లా అధికారి, పూర్వవిద్యార్థి డాక్టర్ డి.గురుస్వామి విద్యార్థులతో పంచుకున్నారు. పోటీపరీక్షలకు సన్నద్ధంకావడం, అంతర్గత సామర్థ్యాలను పెంచుకుని కొత్త పరిశోధనలు ఆవిష్కరించడం, విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలను వివరించారు. కళాశాల సాధించిన పురోగతిని, విద్యాపరంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు అందిస్తున్న పురస్కారాలను అసోసియేట్ డీన్ జగపతిరామయ్య నివేదించారు. కళాశాల వార్షిక ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. వివిధ క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. శాస్త్రీయ, జానపద, సినీగీతాలకు విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, ఓఎస్ఏ డాక్టర్ ఆర్.వేణు, పీడీ జయచంద్ర, మీడియాకమిటీ ప్రతినిధులు ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి, వివిధ విభాగాల హెడ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


వెటర్నరీ కళాశాల ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

బ్రహ్మోత్సవ తొలి వెలుగులు






శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలతో గురువారం తిరుమల క్షేత్రం కనువిందుగా దర్శనమిచ్చింది. అక్టోబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికోసం అలిపిరి నుంచి శ్రీవారి ఆలయం వరకు పలు ప్రాంతాల్లో విద్యుద్దీపాలంకరణలు చేపట్టారు. ఈ క్రమంలో జీఎన్సీ వద్ద గీతాపార్క్, ఆర్చి, చివరిమలుపు, సర్కిల్, గార్డెన్‌లో చేసిన విద్యుద్దీపాలంకరణల పనితీరును గురువారం రాత్రి అధికారులు పరిశీలించారు. గుర్తించిన లోటుపాట్లను సవరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

దామినేడు వద్ద లోకేశ్‌కు ఘన స్వాగతం




దామినేడు వద్ద లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - అటు లోకేశ్ కరచాలనాలు.. ఇటు నాని అభివాదం

తిరుచానూరు, సెప్టెంబరు 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు తిరుచానూరు సమీపంలోని దామినేడు వద్ద ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. టీడీపీ నేతలు అమిలినేని మధు, ఈశ్వర్‌రెడ్డి, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, శ్రీనివాసులు, కత్తి సుధ, మునిరత్నంరెడ్డి, వాసు, సాల్మన్‌రాజు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.


విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నరసింహయాదవ్

లోకేశ్ కోసం నిరీక్షించి.. స్వాగతించి


చంద్రగిరి వద్ద లోకేశ్‌కు కంకణం కడుతున్న సింగు సుధా

చంద్రగిరి, సెప్టెంబరు 19: చంద్రగిరి జాతీయ రహదారిలో మంత్రి నారా లోకేశ్‌కు గురువారం రాత్రి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన రావడం ఆలస్యమైనా ఓపికగా నిరీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, పార్లమెంటు ఉపాధ్యక్షురాలు లంకెళ్ల లలిత, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి, చంద్రగిరి సర్పంచ్ రూపా రామ్మూర్తి, అగరాల జయచంద్రారెడ్డి(జేసీఆర్), రమేష్‌రెడ్డి, వెంకటముని, విశ్వనాథం, బుజ్జిరెడ్డి, జగన్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.


పాకాల మండలం నేంద్రగుంటలో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

పాకాల: ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో పాకాల మండల టీడీపీ నాయకులు నేంద్రగుంట వద్ద మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో ఆయన 15 నిమిషాలు గడిపారు. తెలుగునాడు ఇంటర్మీడియట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒకేషనల్, పార్ట్ టైం, జూనియర్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.


దామినీడు వద్ద వేచి ఉన్న చిన్నగొట్టిగల్లు మండల నాయకులు

లోకేశ్ రాక కోసం..

తిరుపతి రూరల్ మండలం దామినీడు వద్ద మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న చిన్నగొట్టిగల్లు మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, కృష్ణమూర్తి, మల్లికార్జునరెడ్డి, దామోదర్, చంద్రశేఖర్, రమణారెడ్డి, వెంకటరత్నం, చోటా సాహెబ్, మౌలాలి తదితరులు.

- భాకరా పేట

గజమాలతో సత్కరించాలని..



ఆర్సీపురం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు దామినేడు వద్దకు చేరుకున్నారు. క్రేన్ సాయంతో భారీ గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, చిన్నబాబు, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జేడీ జగన్, ఉమాపతినాయుడు, ఢిల్లీనాథరెడ్డి, సురేష్‌నాయుడు, జీవరత్నం, మునెయ్య, మునిరామిరెడ్డి తదితరులున్నారు.

- రామచంద్రాపురం

ఆదమరిస్తే గుంతలోకే...


ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19: నగర పరిధిలోని రైల్వేకాలనీలో ఆదమరచి నడిస్తే గుంతలోకి పడిపోయే ప్రమాదముంది. గతంలో డ్రైనేజీ లీకవుతుండటంతో మ్యాన్‌హోల్ పైకప్పు తెరవడానికి వీలుపడలేదు. దాంతో పక్కన గుంతలా తవ్వి వ్యర్థాలను తొలగించారు. మ్యాన్‌హోల్ పైకప్పును కూడా బయటకు తీసి మళ్లీ యథావిధిగా అమర్చారు. అయితే తవ్విన గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. మళ్లీ అదేగుంత ద్వారా ప్రస్తుతం డ్రైనేజీ పొంగుతోంది. ఆ మార్గంలో నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న పిల్లలు పొరపాటున ఆ గుంతలో పడితే అంతే సంగతులు. రాత్రివేళలో మరింత ఇబ్బందిపడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీ కాపునాడు జిల్లా ప్రధాన సలహాదారుడిగా సాయి రాయల్


డి.సాయి

తిరుచానూరు, సెప్టెంబరు 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి తిరుపతి జిల్లా ప్రధాన సలహాదారుడిగా తిరుచానూరుకు చెందిన టీడీపీ నేత డి.సాయి రాయల్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాయి రాయల్ మాట్లాడుతూ కాపు సంఘం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. సాయిరాయల్‌ను తిరుచానూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కిశోర్‌రెడ్డి, నాయకులు హరేరామ్, రాజేంద్ర, వాసు, మురళి అభినందించారు.

ఆగివున్న లారీని ఢీకొన్న బైక్



లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం - మృతి చెందిన రవి (ఫైల్ ఫొటో)

- ఒకరి మృతి

చంద్రగిరి, సెప్టెంబరు 19: మండలంలోని మామండూరు వద్ద సర్వీసు రోడ్డులో ఆగివున్న పాల ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎం.కొంగరవారిపల్లె కాలనీకి చెందిన మునస్వామి కుమారుడు రవికుమార్(32) చంద్రగిరిలోని సినిమా థియేటర్‌లో పనిచేస్తున్నాడు. సొంత పనుల నిమిత్తం బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా మామండూరు సర్వీసు రోడ్డులో ఆగివున్న కంటైనర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లోకకల్యాణానికి శ్రీకృష్ణ తత్వం అవసరం


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న రేవతి రమణ ప్రభు

పాకాల, సెప్టెంబరు 19: లోక కల్యాణానికి శ్రీకృష్ణతత్వం అనుసరణీయమని తిరుపతి ఇస్కాన్ అధ్యక్షుడు రేవతి రమణ ప్రభు అన్నారు. పాకాల శ్రీకృష్ణ మందిరంలో గురువారం హరినామ వారోత్సవం, శ్రీకృష్ణాజి స్వామి తిరోభావ దినోత్సవం సందర్భంగా హరినామ సంకీర్తనలు, జపం, భజనలు నిర్వహించారు. రేవతి రమణ ప్రభు భక్తులనుద్దేశించి ఉపన్యసించారు. శ్రీకృష్ణ మందిరాన్ని ఇస్కాన్‌కు ఇచ్చిన బల్లా సుధాకర్ చౌదరి దంపతులు అభినందనీయులని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు కృష్ణ ప్రసాదం వితరణ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

భాకరాపేట, సెప్టెంబరు 19: సమగ్ర యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు లక్ష్మీదేవి, శ్రీనివాసులు అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చట్టివారిపాళెం రైతు సేవా కేంద్రంలో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే ఎరువులు, పురుగుల మందులు వినియోగించాలన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత బ్యాక్టీరియా, ఆకుమచ్చ తెగులు ఉన్నాయని, నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరాకు 400 మిల్లీగ్రాములు, ఎండు తెగులు నివారణకు కసుగా మైసిన్ 400 మిల్లీగ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. ఏవో ధనలక్ష్మి, సర్పంచ్ ధనలక్ష్మి, వైస్-సర్పంచ్ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

మహిళను బురిడీ కొట్టించి.. సినీఫక్కీలో చోరీ

- సత్యవేడులో పట్టపగలే ఘటన

సత్యవేడు, సెప్టెంబరు 19: చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు రాజస్తాన్ నుంచి వచ్చిన స్పెషల్ బ్రాంచి పోలీసులమని చెప్పారు. ఓ మహిళను అప్రమత్తం చేస్తున్నట్లు నటించి.. బురిడీ కొట్టించారు. సినీ ఫక్కీలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. సత్యవేడులో గురువారం పట్టపగలే దర్జాగా దొంగతనం చేసి పోలీసులకే సవాల్ విసిరారు. బాధితురాలి కథనం మేరకు.. గంగమిట్ట వీధికి చెందిన అనసూయమ్మ మార్కెట్టుకు నడచుకుని వెళుతుండగా బైక్‌పై ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చారు. తాము చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులమని పరిచయం చేసుకున్నారు. మెడలో బంగారు నగలు వేసుకుని బజారులో వెళ్లడం క్షేమం కాదని, తీసి కవరులో పెట్టుకోవాలని సూచించారు. వీళ్ల మాటలను నమ్మిన ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తీసి కంగారు పడుతూ మడిచి పెట్టుకుంటుండగా.. వారు సాయం చేస్తున్నట్లు నటించారు. ఆ గొలుసును తీసుకుని కవర్‌లో పెట్టి, భద్రంగా ఉంటుందని ఆమెకొంగుకు కట్టి వెళ్లి పోయారు. ఇంటికెళ్ళిన అనసూయమ్మ కవర్‌ను తీసి చూడగా అందులో బంగారు గొలుసు బదులు గులక రాళ్ళు ఉన్నట్లు గుర్తించారు. తాను మోసపోయినట్లు గ్రహించి, లబోదిబోమంటూ ఆమె వీధిలోకి వచ్చి విషయం చెప్పారు. అప్పటికే దొంగలు ఉడాయించారు. సీఐ మురళి, ఎస్ఐ రామస్వామి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. బజారులోని దుకాణాలు, సూపర్ మార్కెట్లలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న సీఐ

సీబీఎస్‌లో స్వచ్ఛత సేవ పక్షోత్సవాలు


బస్టాండును శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 19: సెంట్రల్ బస్సు స్టేషన్‌లో గురువారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు స్వచ్ఛత సేవ పక్షోత్సవాలు నిర్వహించారు. ఏటీఎం రామచంద్రనాయుడు, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సుమతి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, ఆటోడ్రైవర్లు బృందాలుగా ఏర్పడి బస్టాండు నలుమూలల శుభ్రం చేశారు. చెత్త, వ్యర్థాలను తొలగించారు. స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత, పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తాండాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 19: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు చల్లా చంద్రయ్య(తిరుపతి డిపో అసిస్టెంట్ మేనేజర్) ప్రధానమైన ఉద్యోగుల భర్తీ, నూతన బస్సులు, విజయవాడ వరద బీభత్సంతో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రచార కార్యదర్శి కేపీ రెడ్డి, కార్యదర్శి శ్రీపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ


క్రీడా దుస్తులతో విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 19: మంగళం జిల్లా పరిషత్ ఉన్నత(ట్రెండ్స్) పాఠశాల విద్యార్థులకు గురువారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ క్రీడా దుస్తులు వితరణ చేశారు. హెచ్‌ఎం కేశవులనాయుడు దాతను అభినందించారు. గత బుధవారం వడమాలపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులు భావన, పూజిత, భానుప్రసాద్, హేమసాయిలకు దాత చేతులమీదుగా బహుమతులు అందించారు.

22న వారాహి మహారథయాత్ర ప్రారంభం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహారుద్రస్వామి తదితరులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19: లోక కల్యాణార్థం ఈనెల 22న వారాహి మహారథయాత్ర ప్రారంభిస్తున్నట్లు తిరుచానూరు ఆదివారాహి శక్తి ఆలయ పీఠాధిపతి మహారుద్రస్వామి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, వరదల నుంచి విజయవాడ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆదివారాహిశక్తి టెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 23న నెల్లూరు, 24న ఒంగోలు, 25న విజయవాడ, 26న రాజమండ్రి, 27న కాకినాడ, 28న విశాఖపట్నంలో పరిసమాప్తమవుతుందన్నారు. యాత్ర మార్గంలో దాదాపు 10వేల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. సమావేశంలో ట్రస్టు గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ వర్మ పాల్గొన్నారు.

పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా నాగరత్నమ్మ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19 : శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా కె.నాగరత్నమ్మను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంటు ప్రొఫెసర్‌గా ఉన్న నాగరత్నమ్మకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కలించారు. ఈ మేరకు డీఎంఈ నుంచి కళాశాలకు ఆదేశాలు అందాయి.

3డి ప్రింటింగ్‌పై శిక్షణ


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

తిరుపతి (విద్య), సెప్టెంబరు 19: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 3డి ప్రింటింగ్‌పై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సోము టెక్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం చాలా మంచిదన్నారు. 3డి ప్రింటింగ్‌పై శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. 3డి ప్రింటింగ్ పనిచేసే విధానం, మిషనరీ విడిభాగాల అమరిక, 3డి ప్రింటింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌పై నిపుణులు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి సీహెచ్ శైలజ, విభాగం అధ్యాపకులు, ఐఎస్‌టీఈ స్టూడెంట్స్ చాప్టర్ కోఆర్డినేటర్ ధనుంజయులు, దివాకర్, ప్రత్యూష, సోము టెక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు : కాంగ్రెస్


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 19 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ జిల్లా, తిరుపతి నగర అధ్యక్షులు బాల గురవం బాబు, గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బీజేపీ, దాని మిత్రపక్ష నేతలు రాహుల్ గాంధీని తీవ్రవాదితో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్లమెంటు ప్రతిపక్షనేతపై ఇలాంటి వ్యాఖ్యలు బాధాకరమని, ఇలాంటి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే సరైన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, నేతలు సుప్రజా, సింధూజ, హసీనా బేగం, శివశంకర్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు



తిరుపతి రూరల్, సెప్టెంబరు 19: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ కాలూరులో సర్వే నంబరు 69లోని ప్రభుత్వ భూమి(గుడికుంట పోరంబోకు)లో తహసీల్దార్ రామాంజులనాయక్ ఆదేశాల మేరకు గురువారం వీఆర్వో శ్రీనివాసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాలూరులో ప్రభుత్వ భూమి చదును శీర్షిక పేరిట ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన రూరల్ తహసీల్దార్ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కాలూరు లెక్కదాఖల సర్వే నెంబరు69లో 2.06 ఎకరాల ప్రభుత్వ భూమి(గుడికుంట)గా నమోదై ఉందని, దీనిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా, ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డులో పొందుపరిచారు. వీఆర్‌ఏ మణికంఠ పాల్గొన్నారు.

నేడు పద్మావతి వర్సిటీలో ఫుడ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: పద్మావతి మహిళా యూనివర్సిటీ హోం సైన్స్ విభాగంలో శుక్రవారం ఫుడ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఈ మేళా కొనసాగుతుంది. ఆరోగ్యానికి ఉపకరించే ఆహార పదార్థాలను ప్రదర్శించనున్నారు. యూనివర్సిటీ విద్యార్థినులు సందర్శించడానికి వీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు హోం సైన్స్ హెడ్ ప్రొఫెసర్ బిందు తెలిపారు.

చంద్రగిరి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19: చంద్రగిరి సబ్ డివిజన్ డీఎస్పీగా ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు దిశ స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై చంద్రగిరికి వచ్చారు. తిరుపతి రూరల్ స్టేషన్‌లోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు గట్టిగా కృషి చేస్తానన్నారు.

వంకీపురం పవన్‌ను ఆదరించాలి

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 19: టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీ చేస్తున్న వంకీపురం పవన్‌ను ఉద్యోగులు ఆదరించాలని రాష్ట్ర బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు యూ.నాగేశ్వరరావు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం, జాతీయ బీసీ జేఏసీ నుంచి పవన్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. పవన్ బీసీ సంక్షేమానికి కృషి చేస్తున్నారని, సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేశారని తెలిపారు.

అన్న క్యాంటీన్లకు పూర్వ వైభవం

పేదల ఆకలి తీర్చేందుకే: ఎమ్మెల్యే ఆరణి


భోజనం అందిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వంతో పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. రెండో విడతలో భాగంగా గురువారం తిరుపతిలోని నాలుగు క్యాంటీన్లతో పాటు జిల్లాలో పలుచోట్ల ప్రారంభించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లకు తాళం వేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందస్తు హామీ మేరకు క్యాంటీన్లను పునః ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కమిషనర్ మౌర్యతో కలసి నగరంలోని స్విమ్స్ సర్కిల్, ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన, ఎమ్మార్ పల్లి సర్కిల్ సమీపంలోని రెండింటితో పాటు నాలుగు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. జగన్ రెడ్డి కక్షకట్టి పేదోడి కడుపుకొట్టారని మండిపడ్డారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన భోజనం ఐదు రూపాయలకే అందిస్తున్నామన్నారు. తిరుపతికి యాత్రికులు ఎక్కువగా వస్తుంటారని, కాబట్టి మరిన్ని క్యాంటీన్ల ఏర్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీఎల్ సంజయ్, పులుగోరు మురళి, మహేష్ యాదవ్, జనసేన నాయకులు పొలకల మల్లికార్జున్, రాజా రెడ్డి, వూసా మాధవరావు, కార్పొరేటర్లు నరసింహాచారి, బస్వా గీత, రేవతి, నారాయణ, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీఈ సంజయ్ కుమార్ మహేష్, శ్రావణి, రాజు, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చాతుర్మాస దీక్ష


అహోబిలమఠంలో టీటీడీ ఈవో శ్యామలారావు తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 19: అహోబిల మఠం పీఠాధిపతి వణ్శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికులు తిరుమలలో చేపట్టిన చాతుర్మాస దీక్ష గురువారంతో పూర్తయింది. ప్రపంచ శాంతి, లోకకల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెండు మాసాలుగా అహోబిల మఠంలో పీఠాధిపతి సమక్షంలో వేద, దివ్యప్రబంధ పఠనం, విద్వత్ సదస్సులు జరిగాయి. దేశ నలుమూలల నుంచి పండితులు ఈ సదస్సులో పాల్గొన్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి మఠాన్ని సందర్శించారు. కాగా చాతుర్మాస దీక్షకు ఆకెళ్ల విభీషణ శర్మ సంధానకర్తగా వ్యవహరించినట్లు తెలిపారు. యతీంద్ర మహాదేశికులు గురువారం తిరుచానూరులో బసచేసి, శుక్రవారం బెంగళూరు పర్యటనకు బయలుదేరుతారని మఠం కార్యదర్శి విజయ్ ఎచ్చంబాడి తెలిపారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

తిరుపతి(విద్య), సెప్టెంబరు 19: ఎయిడ్స్‌పై రాష్ట్ర స్థాయిలో ఈ నెల 18న విజయవాడలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డీఎంహెచ్‌ఓ, డీఎల్‌ఏటీఓ శ్రీనివాసులురెడ్డి గురువారం వెల్లడించారు. ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని చెంచమ్మ, డాక్టర్ ఎస్ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని రాధిక, చంద్రగిరి బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శశి ప్రియదర్శిని ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, యూనిసెఫ్ ప్రతినిధి శ్రీలత విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నోడల్ పర్సన్ సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.

అసిస్టెంట్ టెక్నీషియన్ నెట్‌వర్క్ అండ్ స్టోరేజ్ కోర్సుకు శిక్షణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 19: అసిస్టెంట్ టెక్నీషియన్ - నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ శిక్షణ ఉంటుందని వివరించారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఆపైన విద్యార్హతలు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు 8143576866, 9985129995 నంబర్లకు ఫోన్ చేసి లేదా https://forms.gle/XeQyn5D7DUWHd3sd6 లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చునని వెల్లడించారు.

భక్తుల భద్రతే లక్ష్యంగా ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎస్పీ, సీవీఎస్వో

తిరుమల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వీక్షించేందుకు వచ్చే భక్తుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం వీరు ఎస్పీఎఫ్, గ్రేహౌండ్స్, ఫైర్, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, ఆర్టీఏ, ఫారెస్ట్, టీటీడీ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఎస్పీ, సీవీఎస్వో మాట్లాడుతూ మాడవీధుల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సీఎం పర్యటనలో చేపట్టాల్సిన భద్రతపైనా చర్చించారు. ఘాట్ రోడ్లు, తిరుమలలోని అన్ని ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందాలతో జల్లెడపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. తిరుపతిలో డ్రగ్స్, గంజాయి వంటి వాటికి తావులేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు

తిరుమల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 78,690 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,086 మంది తలనీలాలు సమర్పించారు.

నవ సోషలిజం పార్టీ క్రియాశీల సభ్యుల నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న పార్టీ అధ్యక్షుడు పాకాల ఆనంద్

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 19: నవ సోషలిజం పార్టీలో క్రియాశీల సభ్యులను నియమించినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాకాల ఆనంద్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా పి.చంద్రబాబునాయుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఏ పద్మావతి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎస్.ధనలక్ష్మి, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా టి.మీనాకుమారి, సత్యవేడు నియోజకవర్గ అధ్యక్షుడిగా టి.వేలాయుధం, తొట్టంబేడు మండలాధ్యక్షుడిగా ఎం.చెంగ్రాయులుకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వారందరికీ నియామకపత్రాలు అందజేశారు.

ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19 : పీహెచ్‌సీల పరిధిలో పని చేసే ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని డీఎంహెచ్‌వో శ్రీహరి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆయన ఆశావర్కర్ల యూనియన్ నేతలతో సమావేశమయ్యారు. పీహెచ్‌సీల్లో, క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది వారి పనులను ఆశాలతో చేయించరాదని సూచించారు. అనంతరం ఆశా వర్కర్ల విధి విధానాల గురించి వివరించారు. డీఐవో శాంతకుమారి, డీసీఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకుంటాం


రవిప్రభుతో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19 : రుయాలో కార్మికుల సమస్యలను అధికారులు పట్టించుకోకపోతే పోరాటాలతోనే పరిష్కరించుకుంటామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్పష్టం చేశారు. రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రవిప్రభుతో గురువారం ఆయన కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించే పరిస్థితి లేదని అధికారులు చెప్పడంతో సమ్మెతో పరిష్కరించుకుంటామని చెప్పి వెనుదిరిగారు. కార్మికుల సమస్యలపై గతంలో పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. లేబరు కోర్టు ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు. సీఐటీయూ నేతలు వేణుగోపాల్, నరసింహులు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి


ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించడం ద్వారా పర్యావరణానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించారు. ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు విద్యావంతులు తోడ్పాటు అందించాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం


ప్రదర్శనను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు పేర్కొన్నారు. హోం సైన్స్ విభాగంలో గురువారం నిర్వహించిన పోషకాహార ప్రదర్శనను ఆయన పరిశీలించారు. హోం సైన్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో ప్రగతి సాధిస్తోందన్నారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు మాట్లాడుతూ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది ప్రతి ఒక్కరికీ పోషకాహారం అనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం సైన్స్ హెడ్ ప్రొఫెసర్ మంజుల, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు ఆర్కే అనూరాధ, కె. అనురాధ, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ భగత్ పాల్గొన్నారు.

ఇంత దారుణమా..!

గత ప్రభుత్వంలో టీటీడీ తీరుపై భగ్గుమన్న కూటమి పార్టీల నేతలు

తిరుపతి(లీలామహల్)/తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19: వైసీపీ ప్రభుత్వ హయాంలోని పాలక మండళ్ల కాలంలో శ్రీవారి లడ్డూ తయారీకి వాడే నెయ్యి నాణ్యత దారుణంగా ఉండేదని తెలియడంతో భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తిరుపతికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు గురువారం భగ్గుమన్నారు. మీడియా సమావేశాలు పెట్టి ఆవేదన.. ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవుడి ప్రసాదాలను సైతం కల్తీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మండిపడ్డారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో శ్రీవారి లడ్డూ నాణ్యతపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. టీటీడీలో కేవలం కమీషన్ల కోసం పని చేసిన ప్రభుత్వం వైసీపీయేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆ పార్టీ నాయకులు వరప్రసాద్, కొనగంటి భాస్కర్ తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023 సెప్టెంబరులో ఒక అజ్ఞాత భక్తుడు బంగారు కిరీటం అందజేస్తే తొమ్మిది నెలల తర్వాత రశీదు ఎందుకు ఇచ్చారన్నారు. టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీని భ్రష్టు పట్టించారని టీడీపీ నేత, టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ మీడియా సమావేశంలో ఆరోపించారు. టీటీడీ లడ్డూ ప్రసాదాల తయారీ విషయం వాస్తవాలు చెప్పిన సీఎం చంద్రబాబుపై వీరు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు చెప్పినవన్నీ నిజాలేనన్నారు. ఆలయంలోపల ఉన్న పరకామణిని వెలుపలకు తీసుకొచ్చి అపచారం చేశారని ఆగ్రహించారు. వీరందరు చేసిన తప్పులకు మాజీ సీఎం జగన్ శిక్ష అనుభవిస్తున్నారన్నారు.

బాధ్యులను శిక్షించాల్సిందే

'తిరుమలేశుడి తరువాత గుర్తొచ్చేది లడ్డూ, వడ మాత్రమే. దర్శనం లేకున్నా భక్తులు ప్రసాదాలతో తృప్తి చెందుతారు. వాటిని తయారుచేయడానికి జంతువుల మాంసం వాడడం అత్యంత దారుణం. అందువల్లే గతంలో రెండో రోజే లడ్డూ చెడిపోయేది. ఇలా తిరుమలలో రూ.వందలకోట్ల స్కాం జరిగింది. దీనికి బాధ్యులందరినీ అరెస్టు చేయాలి. ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డికి శిక్ష పడాల్సిందే'నని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు.

వారి మౌనం అభ్యంతరకరం

'శ్రీవారి లడ్డూ తయారీపై టీటీడీ గత పాలకమండలి నిర్లక్ష్యం కారణంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దేశవ్యాప్తంగా ఇంత పెద్దఎత్తున చర్చ జరుగుతుంటే తిరుమలలో పోటు, దిట్టం పర్యవేక్షించాల్సిన జియ్యర్ స్వాములు ఎందుకు మౌనంగా వున్నారు? ఇతర మఠాధిపతులు, పీఠాధిపతులు సైతం దీనిపై మౌనం వహించడం అభ్యంతరకరం' అని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉన్నట్టని ఎస్వీ మెడికల్ కాలేజీ గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత పేర్కొన్నారు.పద్మావతి డిగ్రీ కాలేజీలో గురువారం నిర్వహించిన అవగాహనాకార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం తినడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. పండ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ధ్యానం, యోగా, వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీల సీజ్



వరదయ్యపాళెం, సెప్టెంబరు 19: ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న మూడు లారీలను శ్రీసిటీ పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని రాచకండ్రిగ సమీపంలో శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ హరి ప్రసాద్, పోలీసులు గురువారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తమిళనాడు వైపు వెళుతున్న వెళుతున్న మూడు ఇసుక లారీలను గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఆర్‌ఎస్ అవకతవకలపై విచారణ చేపట్టండి

● రాష్ట్రపతికి సామాజిక కార్యకర్త నందకిషోర్ ఫిర్యాదు

రేణిగుంట, సెప్టెంబరు 19: స్థానిక సీఆర్‌ఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని తిరుపతికి చెందిన సామాజిక కార్యకర్త నందకిషోర్ గురువారం మెయిల్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా సీఆర్‌ఎస్ రైల్వే ఆస్పత్రిలోని అంబులెన్సు టెండర్ విషయంలో రైల్వే నిబంధనలకు విరుద్ధంగా టైపు-బీ అంబులెన్సును టైప్-సీగా అద్దెకు తీసుకుని అధిక ధనాన్ని కాంట్రాక్టర్లకు ముట్ట చెబుతున్నారని ఆరోపించారు. అలాగే అనుకూలమైన వారి కోసం కాంట్రాక్టుల అప్పగించడలో నిబంధనలు మార్చారని పేర్కొన్నారు. కొన్ని కాంట్రాక్టులను రద్దు చేసి టెండర్లను ఆహ్వానించి మధ్యలో వాటిని రద్దు చేసి ఇలా ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారని వివరించారు. అవినీతికి సంబంధించిన సాక్ష్యాలను సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించి రాష్ట్రపతికి, కేంద్ర రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ



బాధితురాలు సావిత్రమ్మ

కేవీబీపురం, సెప్టెంబరు 19: మండలంలోని ఆరె గ్రామంలో పట్టపగలే వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు.. ఆరె గ్రామానికి చెందిన సావిత్రమ్మ బంగారమ్మ గుడి సమీపంలో పశువులు మేపు తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. తాము పోలీసులమని మెడలో బంగారం వేసుకుని తిరగవద్దని చెప్పారు. ఆమె వారితో మాట్లాడుతుండగానే మరో ఇద్దరు అక్కడికి వచ్చి ఆమె మెడపై అకస్మాత్తుగా కొట్టడంతో ఆమె ముందుకు వాలిపోయింది. వెంటనే ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తులు ఆమె మెడలోని 36 గ్రాముల బంగారు చైనును లాక్కుని పరారయ్యారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశారు.

ఎస్వీయూకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌తో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 19: ఎస్వీయూకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఏడు దశాబ్దాల సుదీర్ఘ చరిత్రలో అత్యున్నత ప్రమాణాలతో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేసిన కృషికి ఈ గుర్తింపు ప్రకటించారు. యూనివర్సిటీలో రెండు రోజులుగా హైదరాబాదుకు చెందిన హెచ్‌వీఎం ఇంటర్నేషనల్ సంస్థ అధ్యయనం చేసి ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని ఐఎస్‌వో ప్రతినిధి శివయ్య అందజేశారు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితో యూనివర్సిటీ ఈ గుర్తింపు లభించిందన్నారు. తాళపత్రాల సంరక్షణకు ఓఆర్‌ఐ తీసుకున్న చర్యలకు ఐఎస్‌వో ప్రతినిధి బృందం ప్రత్యేక సర్టిఫికేషన్ ఇచ్చింది. ఇందుకు ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లును అధికారులు అభినందించారు. రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి.నరసింహ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
ఇద్దరికి గాయాలు

పిచ్చాటూరు, సెప్టెంబరు 19: కారు అదుపుతప్పి లారీను ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు కాలు విరిగింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. సత్యవేడు ప్రాంతానికి చెందిన కొందరు పుత్తూరుకు సొంతపనులపై వచ్చారు. పనులు ముగించుకుని కారులో సత్యవేడుకు బయలుదేరారు. అదే సమయంలో ఊత్తుకోట నుంచి పుత్తూరుకు ఓ లారీ వస్తోంది. పిచ్చాటూరు సమీపంలోని సీరువాయి బైపాస్ వద్ద మలుపులో కారు అతి వేగంగా వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో వెనుకవైపు రాసుకుంటూ దూసుకెళ్లింది. కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కారులోని మహిళకు కాలు విరిగింది. గాయపడ్డ వారిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దీని భావమేమి సారు....!?

● తహసీల్దార్ కార్యాలయంలో మొబైల్స్ నిషేధం

'మొబైల్ ఫోన్స్‌కు అనుమతి లేదు' అని సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం నోటీసులు అంటించారు. ప్రత్యేకించి తహసీల్దార్ చాంబర్‌కు రెండు వైపులా అంటించారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తమ మొబైల్స్‌ను ఎక్కడ ఉంచాలో అర్థంకాక మదనపడుతున్నారు. కలెక్టరేట్, సీఎంవోలలో సైతం లేని ఆంక్షలు ఇక్కడ ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

\- సత్యవేడు



మంత్రి లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘనస్వాగతం





శ్రీకాళహస్తి/ ఏర్పేడు, సెప్టెంబరు 19: మంత్రి నారా లోకేశ్‌కు తిరుపతి విమా నాశ్రయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఏర్పేడు మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులునాయుడు ఘనస్వాగతం పలికారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు శ్రీకాళహస్తి కలంకారీ పట్టువస్త్రాలతో, ముక్కంటి శేషవస్త్రంతో, పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వరదయ్యపాళెంలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులు

ఏర్పేడు, సెప్టెంబరు 19: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సర్పంచుల సంఘం అధ్యక్షులు శివయ్య అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పేడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: కంచనపుత్తూరు గ్రామంలో సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, వైద్య, అంగన్వాడీ సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని చిన్నపాండూరు పంచాయతీ కార్యదర్శి హనీఫ్ పేర్కొన్నారు. ఎంపీడీవో ప్రసాద్ ఆదేశాల మేరకు శుభ్రతపై ర్యాలీ చేపట్టారు.

సమాజ సేవలో టీచర్లు భాగస్వాములు కావాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత గుమ్మడి మురళి అన్నారు. సహ ఉపాధ్యాయుడి సోదరుడు ప్రమాదానికి గురై స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అతనికి రక్తదానం చేశారు. మరో ఇద్దరిని తీసుకెళ్లి రక్తదానం చేయించారు. గుమ్మడి మురళి మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 17వ సారి రక్తదానం చేసినట్లు తెలిపారు.

నైతిక విలువలు పాటించాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించాలని అప్పుడే సమాజం బాగుంటుందని ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జమాత్ ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వర్మ, అధ్యాపకులు రోహిణి, సంక్రాంతి రాజేంద్రుడు, సతీష్‌కుమార్, పరంధామయ్య, విద్యార్థులు, జమాత్ ఇస్లామి హింద్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు.. ఒకరికి గాయాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: కారు అదుపు తప్పి ద్విచక్ర వాహన దారుడిని ఢీకొంది. దీంతో అతడికి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి నుంచి చెన్నై వైపు వెళుతున్న కారు పట్టణ శివారులోని డంపింగ్‌యార్డు సమీపంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి తొట్టంబేడు మండలం తాటిపర్తికి చెందిన కుమార్ నాయుడు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొంది. ఆ క్రమంలో మరింత అదుపు తప్పి గోపినాయుడు మెకానిక్ షెడ్ వద్ద ఉన్న నిలిపి ఉంచిన ఓ పాత్రికేయుడికి చెందిన కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కుమార్‌నాయుడు కాలికి తీవ్రగాయమైంది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

కేవీబీపురం, సెప్టెంబరు 19: కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అలాగే పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి కోరారు. గురువారం మండలంలోని కోవనూరు జెడ్పీ హైస్కూల్లోని బాలికలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తరువాత చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలని, ఉతికిన దుస్తులు ధరించాలని సూచించారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. శుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.

మెరుగైనవైద్యం అందించండి : సుధీర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త హుమయూన్ తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్విమ్స్ డైరెక్టర్‌కు ఫోన్ చేశారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. హుమయూన్‌ను రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, పట్టణ నాయకుడు షఫీ పరామర్శించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అంది స్తున్న పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పీఎస్ పురం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై బాలింతలకు, గర్భిణులకు గురువారం అవగాహన కల్పించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు పల్లం విద్యార్థి

ఏర్పేడు, సెప్టెంబరు 19: పల్లం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నాగ రాజు అండర్-14 రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నాగరాజును ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. హెచ్‌ఎం ఆనంద్ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నాగరాజు జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తాడన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణి, ఉపాధ్యాయులు శ్రీరాములు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

పిచ్చాటూరు, సెప్టెంబరు 19: పోషకాహార మాసోత్సవ ర్యాలీలో భాగంగా మండలంలోని వెంగళత్తూరు జడ్పీ హైస్కూలు విద్యార్థినులు పోషకాహార సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ మారియమ్మ మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్య వివాహాలను వ్యతిరేకించాలని కోరారు. కార్యదర్శి శాంతి, ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆయాలు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ మంజుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న చెంచమ్మ, పక్కన పాఠశాల నోడల్‌పర్సన్ సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, సెప్టెంబరు 19: ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని ఉపయోగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిర్మల్‌కుమార్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఈ నెల 18న కేఎల్ యూనివర్శిటీ విజయవాడలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో బండారుపల్లి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చెంచమ్మ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల (యూనిసెఫ్) చేతుల మీదుగా కేఎల్ యూని వర్సిటీలో ప్రశంసాపత్రం అందుకుంది. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, గుణ శేఖర్‌రెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, కుమార్ రాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రాధా కుమారి, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, స్టెల్లా మేరిలు చెంచమ్మను అభినందించారు.

ఉచిత ఇసుక పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీకి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆవిష్కరించారు. ఇసుక నిర్వహణ పోర్టల్‌ను అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఏఎస్పీ రవిమనోహరాచారి తదితర అధికారులు పాల్గొన్నారు. పోర్టల్ ప్రారంభ వర్చువల్ కార్యక్రమం పూర్తయిన తరువాత ఎమ్మెల్యే, ఏఎస్పీ, గనులశాఖ అధికారులు, ఇతర అధికారులతో కలిసి ఇసుక నిర్వహణ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

స్విమ్స్‌లో తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభం



తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 19: స్విమ్స్‌లో తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలు ప్రారంభమయ్యాయి. స్విమ్స్‌లో కాన్పు చేయించుకున్న తల్లులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం రెండు తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందించింది. వీటిని గురువారం డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ప్రారంభించారు. హైరిస్కు గర్భవతుల రవాణా కోసం స్విమ్స్ ఇప్పుడు రెఫరల్ హాస్పిటల్ కిందకు రావడం జరిగిందని ఇందులో భాగంగా మాతా శిశు మరణాలను నివారించేందుకు హాస్పిటల్లో ప్రభుత్వం రెండు వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ వాహన సేవలు అవసరమైన వారు 102 నంబరుకు కాల్ చేస్తే 30 నిమిషాల వ్యవధిలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల మాదిరిగానే స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రిలోనూ కాన్పులు ఉచితంగా చేస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా సిజేరియన్, హైరిస్కు గర్భవతులకు ఉచిత కాన్పులు కూడా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, ఆర్‌ఎంవో కోటిరెడ్డి, వైద్యాధికారులు మృదుల, ప్రవళిక, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ జిల్లా సమన్వయకర్త సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను బురిడీ కొట్టించి.. సినీఫక్కీలో చోరీ

● సత్యవేడులో పట్టపగలే ఘటన



సీసీటీవీ పుటేజీలను పరిశీలిస్తున్న సీఐ

సత్యవేడు, సెప్టెంబరు 19: చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన స్పెషల్ బ్రాంచి పోలీసులమని చెప్పారు. ఓ మహిళను అప్రమత్తం చేస్తున్నట్లు నటించి.. బురిడీ కొట్టించారు. సినీ ఫక్కీలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. సత్యవేడులో గురువారం పట్టపగలే దర్జాగా దొంగతనం చేసి పోలీసులకే సవాల్ విసిరారు. బాధితురాలి కథనం మేరకు.. గంగమిట్ట వీధికి చెందిన అనసూయమ్మ మార్కెట్టుకు నడచుకుని వెళుతుండగా బైక్‌పై ఇద్దరు అపరచిత వ్యక్తులు వచ్చారు. తాము చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులమని పరిచయం చేసుకున్నారు. మెడలో బంగారు నగలు వేసుకుని బజారులో వెళ్లడం క్షేమం కాదని, తీసి కవరులో పెట్టుకోవాలని సూచించారు. వీళ్ల మాటలను నమ్మిన ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తీసి కంగారు పడుతూ మడిచి పెట్టుకుంటుండగా.. వారు సాయం చేస్తున్నట్లు నటించారు. ఆ గొలుసును తీసుకుని కవర్‌లో పెట్టి, భద్రంగా ఉంటుందని ఆమెకొంగుకు కట్టి వెళ్లి పోయారు. ఇంటి కెళ్లిన అనసూయమ్మ కవర్‌ను తీసి చూడగా అందులో బంగారు గొలుసు బదులు గులక రాళ్ళు ఉన్నట్లు గుర్తించారు. తాను మోసపోయినట్లు గ్రహించి, లబోదిబోమంటూ ఆమె వీధిలోకి వచ్చి విషయం చెప్పారు. అప్పటికే దొంగలు ఉడాయించారు. సీఐ మురళి, ఎస్‌ఐ రామస్వామి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. బజారులోని దుకాణాలు, సూపర్ మార్కెట్లలో సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్రను చూసి ఓటు వేయండి మజ్దూర్ యూనియన్‌ను గెలిపించండి

రేణిగుంట, సెప్టెంబరు 19: రైల్వే కార్మికులు హక్కుల కోంస మొదట నుంచి పోరాడుతున్న మజ్దూర్ యూనియన్ అని ఈ చరిత్రను చూసి ఓటు వేయాలని ఆల్ ఇండియా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శంకర్‌రావు కోరారు. గురువారం సీఆర్‌ఎస్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వ హించారు. కార్మికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జరగబోయే యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్‌యూనియన్ సభ్యులను గెలిపించేందుకు నాయకులు, కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయకుమార్, బాబు, సదాశివరెడ్డి, మునికుమార్, మునిరాజయ్య, చంద్రశేఖర్, చంద్రనాయక్, తిలక్ కుమార్‌రెడ్డి, రైల్వే విశ్రాంత ఉద్యోగులు అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రైల్వే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శ్మశాన స్థలాన్ని రక్షించండి: ఎమ్మార్పీఎస్



పుత్తూరు, సెప్టెంబరు 19 : మండలంలోని చెర్లోపల్లి శాంతినగర్ ఆది ఆంధ్రవాడలో కబ్జాకు గురవుతున్న శ్మశాన స్థలాన్ని రక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మునివేలు డిమాండ్ చేశారు. శ్మశాన స్థలం ఆక్రమణపై గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా శ్మశానాలు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలియ జేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శివయ్య, మురుగారెడ్డి, దాము, గోవిందయ్య పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



కన్నయ్యనాయుడు

పుత్తూరు, సెప్టెంబరు 19 : పుత్తూరుకు చెందిన వ్యాపారవేత్త జయరామానాయుడి తండ్రి కన్నయ్యనాయుడు (103) గురువారం ఉదయం మృతిచెందారు. 60 ఏళ్ల క్రితం తమిళనాడులోని వేలంజేరి గ్రామం నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారంలో స్థిరపడ్డారు. గత ఏడాది 102 ఏళ్ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మృతికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, కేఎల్ఎన్‌మూర్తి, మాధవనాయుడు, రఘురాజు, రామచంద్రనాయుడు, తెలుగుదేశం నాయకులు జీవరత్నం నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిరు ఉద్యోగులకు రక్షణ కల్పించాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 19: వడమాలపేట మండలంలోని చిరు ఉద్యోగులకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం కోరారు. వడమాలపేట సీఐటీయూ అనుబంధ సంఘాలతో సీఐటీయూ కార్యాలయంలో ఆర్.వెంకటేష్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఇందులో బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చిరు ఉద్యోగుల పైన రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు నందయ్య, జయరామయ్య, అంగన్వాడీ నుంచి కృష్ణవేణి, జయంతి, గంగులమ్మ, చంద్రమ్మ, సంఘమిత్ర కమలమ్మ, రుక్మిణమ్మ, సుభద్ర, వీఆర్‌ఏ నుంచి లోకనాథం, దామోదరం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 19: జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో మూఢ నమ్మకాల పట్ల విశ్వాసాన్ని తొలగించడం, సైన్స్ పట్ల అభిరుచి కల్పించడం ఈ పరీక్ష ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెకుముకి కో-ఆర్డినేటర్లు వేణుగోపాల్, నరేంద్ర, విజయనాగు, మండల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 19: రాష్ట్రీయా సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల ఆరోగ్య కోసం గురువారం కాపువీధిలోని రాస్ కార్యాలయంలో టాటా ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, హైపటైటిస్, నోటి, గొంతు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్యబాబు, రాస్ అధికారులు రవి, ప్రకాష్, ఉష, రమణి, రెడ్డిరాణి, మోహతాజ్, మహేంద్ర, ధన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన



సత్యవేడు, సెప్టెంబరు 19: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సత్య వేడులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఆ దిశగా అధికారులు ప్రయ త్నాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సత్యవేడులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థానిక ఆత్మ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశారు. తహసీల్దార్ టీ.సుబ్రమణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గురువారం స్థలాన్ని పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయులు పరమశివం, అమానరెడ్డి, శశి, అరుళ్, కుబేంద్రన్ పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో రైల్వే అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 19: గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని గురువారం సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పీడీ మిశ్రా దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరిబాబు నాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రైల్వే అధికారులను వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేదపండితులు యోగేంద్ర పవన్ వర్మ, వంశీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

25న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 25వ తేదీ బుధవారం హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు చేశారు స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. పలు హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రెండు స్టార్టర్ల చోరీ

ఏర్పేడు, సెప్టెంబరు 19: మండలంలోని మేర్లపాక పంచాయతీ పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉన్న స్టార్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బత్తెయ్య, రాము అనే రైతుల స్టార్టర్లు బుధవారం రాత్రికి చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత్తుతో జీవితాలు చిత్తు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. గురువారం మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కోసం పట్టణంలోని దిస్కూల్ ఆవరణం నుంచి 2కే రన్ నిర్వహించారు. డీఎస్పీ నరసింహమూర్తి జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వన్‌వే, వన్‌సైడ్ పార్కింగ్, హెల్మెట్ ధారణ, సీటు బెల్టు తదితర అంశాలపై వివరించారు. ది స్కూల్ నుంచి శివసర్కిల్, భేరివారి మండపం, శ్రీకాళహస్తీశ్వరాలయం, జలవినాయకుడు, పొన్నాలమ్మ ఆలయం మీదుగా స్కిట్ కళాశాల వరకు ర్యాలీ సాగింది.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: నియోజకవర్గంలో ప్రజాసమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ భూ సమస్యలపై ఆర్డీవోకు విన్నవించినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధి కారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. సమస్యలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తులసీరాజన్, మించల శివ కుమార్, మోహన్‌రెడ్డి, గోపి, శ్రీనివాసులు, మురళి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్క సీతమ్మ స్ఫూర్తితో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అధ్వర్యంలో సుమారు 400 మంది పేదలకు అన్నదానం చేశారు. పేట చంద్రశేఖర్, చిరంజీవి, కావలి శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్, రవి కుమార్‌రెడ్డి, దినేష్, సురేష్, మణి, శ్రీనివాస్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

ఎల్లుండి ఉచిత కంటి వైద్య శిబిరం

వరదయ్యపాళెం: మండలం లోని అవంతి లెదర్స్ అధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరదయ్యపాళెం నుంచి ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

పిచ్చాటూరు: అప్పలరాజు కండ్రిగ గ్రామ పంచాయతీలో తొల గించిన స్వచ్ఛభారత్ పంచా యతీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు చిన్నిరాజు కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం మూడోరోజుకు చేరింది. ఏఐటీయూసీ సత్య వేడు నియోజకవర్గ నాయకులు సుభాష్, ఏపీ స్వచ్ఛ భారత్ పంచాయతీ కార్మికుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అన్నాదొరై, రాజా, ఆనందం, మునిచంద్ర, మహేష్ పాల్గొన్నారు.





